క్లుప్తంగా

నగర పంచాయతీ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి



కమిషనర్‌ను అభినందిస్తున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా జి.వెంకట రామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది అభినందించారు. వెంకట రామిరెడ్డి జమ్మల మడుగు మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే ఇప్పటివరకూ ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.లోవరాజు కృష్ణా జిల్లా వుంగటూరు బదిలీ అయ్యారు.

చల్లపల్లిలో తాచుపాము హల్‌చల్



చల్లపల్లిలో తాచుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో మేకల వెంకటేశ్వరరావు ఇంట్లో సోమవారం ఉదయం తాచుపాము ప్రవేశించి అలజడి సృష్టించింది. దీంతో వెంకటేశ్వరరావు కుటుంబీకులు భయాందోళనకు గురవ్వడంతో స్థానికులు భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్ వర్మకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆయన వచ్చి పామును చాకచక్యంగా డబ్బాలో బంధించి దూరప్రాంతంలో విడిచి పెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వర్మను అభినందించారు.

జగన్ పాలనలోనే పేదలందరికీ ఇళ్లు



గోపవరంలో లబ్ధిదారునికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ బుల్లియ్య

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే పేదలందరికీ పార్టీలకు అతీతంగా ఇళ్ల స్థలాలు లభించాయని సర్పంచ్ కుంచే బుల్లియ్య అన్నారు. మండలంలోని గోపవరం గ్రామ సచివాలయంలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఏర్పాటుచేసిన ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సోమవారం ఆయన పాల్గొన్నారు. సీఎం జగన్ నవరత్నాల్లో భాగంగా ఇళ్ల స్థలం అందించి, దాన్ని రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తున్నారని ప్రతిఒక్కరూ జగనన్నను గుర్తుపెట్టుకుని మళ్లీ సీఎంను చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు, గ్రేడ్–5 కార్యదర్శి సుమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టారుకు నివాళులు

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట నీలాద్రిపేట గ్రామానికి చెందిన బౌద్ధ ఉపాసకుడు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ కాశి జానకిరాముడు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన స్వగృహం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరాముడు మాస్టారు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, వడ్డి ఏడుకొండలు తదితరులు జానకిరాముడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూనియర్ కళాశాల భవనాన్ని పునర్నిర్మించాలి

అమలాపురం రూరల్: కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలమైన నేపథ్యంలో కళాశాల భవనాన్ని పునర్నిర్మించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యను వివరిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్, జిల్లా కోకన్వీనర్ వెంకట్, జిల్లా కన్వీనర్ రవికుమార్, సాయికుమార్, సందీప్ పాల్గొన్నారు.

ఎంపీపీని కలిసిన నూతన ఎంపీడీఓ

తాళ్లరేవు: ఎంపీపీ రాయుడు సునీతను మండల నూతన ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.ప్రభాకర్‌రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీని దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్ మోహన్‌కృష్ణ, ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అండగా.. సాయం ఆగకుండా..

- అనారోగ్యంతో బాధపడుతున్న పింఛన్‌దారులకు వలంటీర్ల సాయం
- దూర ప్రాంతాలకు వెళ్లి మరీ పింఛన్ల అందజేత

ఉప్పలగుప్తం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ లబ్ధిదారులకు కొండంత అండగా మారింది. ప్రధానంగా ప్రతీ నెలా ఒకటో తేదీ తెల్లవారుతుండగానే తలుపు తట్టి మరీ రూ.3 వేల పింఛన్ అందజేస్తుండడంతో లబ్ధిదారులంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పైగా అనారోగ్యంతో బాధపడుతున్న పింఛన్ లబ్ధిదారులకు సాయం ఆగకుండా దూర ప్రాంతాలకు వెళ్లి మరీ పింఛన్ అందజేస్తుండడంపై అందరూ ప్రశంసిస్తున్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్‌దారులను వారాల తరబడి తిప్పుకోవడమే కాకుండా అవ్వాతాతలను సైతం పింఛన్ ఇచ్చేందుకు సిగ్నల్ లేదంటూ కొండలు, గుట్టలు ఎక్కించేవారంటూ గుర్తు చేసుకుంటున్నారు. ఎవరైనా అనారోగ్యంతో చెప్పిన చోటకల్లా తిరగలేకపోతే అలాంటివారి పింఛన్ డబ్బులు ఆగిపోయేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్ల పుణ్యమా అని పింఛన్‌దారులకు ఏ ఒక్క నెలా పింఛన్ ఆగకుండా అందుతుంది.

ఉప్పలగుప్తం మండలంలోని విలసవిల్లి, భీమనపల్లి గ్రామాల వలంటీర్లు దూర ప్రాంతాల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల కోసం సోమవారం అక్కడకు వెళ్లి పింఛన్ అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. విలసవిల్లి గ్రామానికి చెందిన నవుండ్రు చిన సత్యనారాయణ అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ దుర్గారావు ఆసుపత్రికి వెళ్లి ఆయనకు రూ.3 వేల పింఛన్ అందజేశారు. అదే గ్రామానికి చెందిన నందుల ఆదినారాయణ అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు వలంటీర్ అడబాల దుర్గాభవాని ఆసుపత్రిలో పింఛన్ అందించారు. భీమనపల్లి గ్రామానికి చెందిన నందికం పద్మావతి అనారోగ్యం పాలై గుంటూరులోని తమ బంధువుల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ సామంతకుర్తి సౌజన్య గుంటూరు వెళ్లి ఆమెకు పింఛన్ అందించింది. వారిని లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో పాటు గ్రామ సర్పంచ్‌లు సలాది ఊర్మిళాదేవి, పెయ్యిల రాజ్‌కుమర్, ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వర ప్రసాద్‌లు అభినందించారు.



కాకినాడ ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గారావు



అమలాపురంలో పింఛన్ ఇస్తున్న వలంటీర్ దుర్గాభవాని



గుంటూరు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య

మహిమ గల దేవుడు మురమళ్ల వీరేశ్వరుడు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఎంతో మహిమ గల దేవుడని టీటీడీ బోర్డు సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం వీరేశ్వరస్వామి ఆలయంలో రూ.55 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీవీరేశ్వర సూర్యబలిజ నిత్య అన్నదాన భవనాన్ని ఆయన ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అన్నదాన భవనంలో రూ.9 లక్షల భక్తుల విరాళాలతో భక్తులు భోజనం చేసేందుకు వీలుగా స్టీల్ టేబుళ్లు, అనావతరానికి చెందిన నూకల సూర్యనారాయణ రూ.3 లక్షల ఆర్థిక సాయంతో అన్నదాన స్టేంను, మాచిరాజు లక్ష్మీపావని జ్ఞాపకార్థం సమకూర్చిన రూ.4 లక్షలతో వంట గదులను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో నూతనంగా రూ.4 లక్షలతో నిర్మించిన శ్రీవీరేశ్వర గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఆలయంలో రూ.2 కోట్లతో వివిధ శాశ్వత అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం దాతలను ఎమ్మెల్యే పొన్నాడ దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, పెన్మత్స చిట్టిరాజు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ కాశీ రాజుబాబు, దేవాదాయ శాఖ ఏసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

సీసీ రహదారికి శంకుస్థాపన

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీ పరిధిలోని ఈబీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని సీసీ రహదారిగా అభివృద్ధి చేసే పనులకు ఎంపీపీ రాయుడు సునీత సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.6.5 లక్షల మండల పరిషత్ నిధులతో రహదారిని నిర్మించనున్నామని, దీంతో పాటు గ్రామంలో మరికొన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎంపీపీ సునీత తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ, కొటికెలపూడి చందు, ఊబ కామేశ్వరరావు, కోటిపల్లి దొరబాబు, గంజా కాశీవిశ్వనాథ్, అప్పలరాజు పాల్గొన్నారు.



సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

వాలీబాల్ జట్టు సభ్యులకు సత్కారం

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన కోరంగి వాలీబాల్ జట్టును సోమవారం ఘనంగా సత్కరించారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలోని మహాలక్ష్మి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జట్టు కెప్టెన్ దాసరి ఉమాశంకర్‌తో పాటు జట్టు సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు కొపనాతి నాగరాజు, సంగాడి శ్రీనివాస్ తదితరులు సత్కరించి అభినందించారు. ముమ్మిడివరం హైస్కూల్‌లో జరిగిన ఫైనల్ పోటీల్లో కాట్రేనికోన జట్టుపై కోరంగి జట్టు విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికై సత్తా చాటిందని కొపనాతి నాగరాజు తెలిపారు.



కోరంగి వాలీబాల్ జట్టు సభ్యులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: గోడిలోని బాలుర గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉండాలని, తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులకు మార్చి 10న రాత పరీక్ష నిర్వహిస్తామని, అందులో మెరిట్ ఆధారంగా సీటు కేటాయిస్తామన్నారు. ఐదో తరగతికి 80 సీట్లు, ఇంటర్ ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

ఐ.పోలవరం: యువత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇస్రో శాస్త్రవేత్త విష్ణువర్జుల రామమూర్తి అన్నారు. మురమళ్ల శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులకు స్పేస్ రీసెర్చ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో దేశానికి ఏవిధంగా దోహదపడుతుందో, ఇస్రో వల్ల కలుగుతున్న మేలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్త రామమూర్తిని స్కూల్ కరస్పాండెంట్ గోకవరపు వెంకట్రాజు, నందుల ఈశ్వరరావు, పి.వెంకటేశ్వరావు, ఉంగరాల వెంకటేశ్వరావు తదితరులు ఘనంగా సన్మానించారు.



శాస్త్రవేత్త రామమూర్తిని సన్మానిస్తున్న ప్రముఖులు

13న హిమాలయ యోగి రాక

అమలాపురం టౌన్: అంతర్జాతీయ యోగా నిపుణుడు, హిమాలయ యోగి యాష్ శేఖర్ ఆంధ్ర రాష్ట్రంలో తన పది రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 13, 14, 15 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని ఆ యోగి దక్షిణ రాష్ట్రాల ప్రతినిధి విశ్వనాథ్ తెలిపారు. స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆది శేష నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 13న తేదీ సాయంత్రం 4 గంటలకు అమలాపురం ఆది శేష నిలయంలో ధ్యానం, యోగా వంటి ఆరోగ్య సూత్రాలపై హిమాలయ యోగి యాష్ శేఖర్ ఉపన్యసిస్తారన్నారు. అక్షయ పాత్ర అధ్యక్షురాలు పోతురాజు నాగ కనకదుర్గ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చింతా శంకరమూర్తి, అరిగెల బుజ్జి, లింగోలు విస్సు తదితరులు పాల్గొన్నారు.

వై జంక్షన్‌లో ట్రాఫిక్ ఐల్యాండ్ ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: స్థానిక పేరూరు వై జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ పెరిగి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా అక్కడ ట్రాఫిక్ ఐల్యాండ్, సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సుసురాపు శ్రీధర్‌కు కోనసీమ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్(కోకో ఫెడ్) ప్రతినిధుల బృందం వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్, బీవీవీ సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహమూర్తి, ఎం.సతీష్ తదితరులు ఎస్పీ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు.



జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కోకో ఫెడ్ చైర్మన్ బలరామమూర్తి తదితరులు

చిత్రలేఖనం పోటీల్లో విజేతకు సత్కారం

అల్లవరం: హాస్యనటుడు బ్రహ్మానందం పుట్టినరోజును పురస్కరించుకుని ఇటీవల విజయవాడలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి చెందిన దారా గాయత్రి పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచి పది వేల మంది చిత్ర కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో జిల్లాకు చెందిన గాయత్రి ద్వితీయ స్థానం సాధించడం గ్రామానికే గర్వకారణమని శెట్టిబత్తుల తులసీరావు అన్నారు. ఈ సందర్భంగా గోడిలంకలో గాయత్రిని గ్రామస్తులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పోతుల నాగేశ్వరరావు, శెట్టిబత్తుల బాలకృష్ణమూర్తి, కటారి చంద్రరావు, కుంచే సూర్యనారాయణ, కాశి శ్రీనివాస్, దాకారపు ఏడుకొండలు, అఖిల్, రామకృష్ణ పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన గాయత్రిని అభినందిస్తున్న గోడిలంక గ్రామస్తులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యానాం: ఏపీ ట్రాన్స్‌కో హైటెన్షన్ విద్యుత్ వైర్ల మరమ్మతుల పనుల నిమిత్తం యానాం పట్టణంలో ఈ నెల 7వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ లంక కృష్ణారావు సోమవారం తెలిపారు.

దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్యానిధికి విరాళం



సుబ్రహ్మణ్యస్వామికి విరాళం అందజేస్తున్న శేషుబాబు

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్యానిధికి కొత్తపేట గ్రామానికి చెందిన బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఓ కాశిన శేషుబాబు రూ.15,116 విరాళం అందించారు. సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామికి సోమవారం సదరు మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేషుబాబును వైద్యులు వాసు నాయక్ తదితరులు అభినందించారు.

నూతన రేషన్ షాప్ ప్రారంభం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో ఏర్పాటు చేసిన నూతన రేషన్‌షాపును ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో రేషన్ షాప్ నెంబర్–33 దివ్యాంగురాలైన కేదారేశ్వరాంబకు మంజూరైంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మంత్రి విశ్వరూప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం హిమ భారతి, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు జాన గణేష్ కూర్మ క్రీస్తుబాబు, కొండా పద్మావతి పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభించిన ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి

వేతన ఒప్పంద చర్చలు సఫలం

యానాం: యానాం రైస్‌మిల్లర్లు, కార్మికుల మధ్య నూతన వేతన ఒప్పంద చర్చలు సఫలమైనట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేబర్ ఇన్‌స్పెక్టర్ దయానిధి సమక్షంలో జరిగిన చర్చల్లో టన్నుకి రూ.5, టోటల్ బిల్లుపై 15 శాతం పెంచేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. రైస్ మిల్లు యాజమాన్యాల నుంచి కంచర్ల చిన్నబ్బాయి, మేర్ల దుర్గాప్రసాద్, రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ నుంచి నాయకులు సలాది నాగబాబు, దాసరి రాజు, సబ్బతి రాంబాబు, కొప్పిశెట్టిట నాగేశ్వరరావు, సత్తిబాబు, శ్రీను చర్చల్లో పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ఐ.పోలవరం: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఐ.పోలవరం ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం ట్రైనీ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, సీఐ కొండయ్య, ఎస్ఐ రాజేష్‌లు తమ సిబ్బందితో కలిసి ఎదుర్లంక బ్రిడ్జివద్ద ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన తనిఖీల్లో యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న 10 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 40 మద్యం సీసాలు, కారు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి



బ్యాంకును ప్రారంభిస్తున్న ఎస్పీ రఘునాయగం

యానాం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా బ్యాంకింగ్ వ్యవస్థ పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందని ఎస్పీ రఘునాయగం పేర్కొన్నారు. సోమవారం స్థానిక విష్ణాలయం వీధిలో నూతనంగా ఏర్పాటుచేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు యానాం శాఖను ఆయన ప్రారంభించారు. ఏటీఎంను ఇన్‌చార్జి పరిపాలనాధికారి, డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ దొరయ్యస్వామి, డిప్యూటీ మేనేజర్ వెంకటప్రసాద్, న్యాయవాది మాజేటి నటరాజ్, సీఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు పాల్గొన్నారు.

14లోగా వేట నష్టపరిహారం అందేలా చర్యలు

యానాం: నియోజకవర్గ మత్స్యకారులకు ఓఎన్‌జీసీ వేట నష్టపరిహారం ఈ నెల 14వ తేదీలోగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన పరిహారానికి సంబంధించి వివిధ పార్టీల ప్రతినిధులతో, మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్ట పరిహారం పుదుచ్చేరి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన లేఖను ఓఎన్‌జీసీ అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు విడతలుగా పరిహారం ఇచ్చేందుకు చమురు సంస్థ అంగీకరించడంతో వారి ఖాతాలో ఉన్న రూ.71 కోట్లను ప్రభుత్వ ఖాతాలో ఉన్న రూ.23 కోట్లు కలిపి మొత్తంగా రూ.94 కోట్లు 15 నెలలకు గాను ఇవ్వడానికి ఓఎన్‌జీసీని కోరనున్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీన సీఎం రంగసామి, మంత్రి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పాఠశాలల పరిశీలన



గొల్లవిల్లిలో తరగతి గదులను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మధుసూదన్‌రావు

ఉప్పలగుప్తం: మండలంలోని వివిధ పాఠశాలలను సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గొల్లవిల్లిలో నాబార్డ్ నిధులతో నిర్మించిన తరగతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ సత్తి సత్యకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నూతన తహసీల్దార్‌గా మల్లికార్జునరావు



ఉప్పలగుప్తం: మండల నూతన తహసీల్దార్‌గా టి.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డీటీ వైవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఎం.వెంకటరమణ, వీఆర్వోల మండల అధ్యక్షుడు అహ్మద్ ఆలీషాతో పాటు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఇప్పటివరకూ కృష్ణా జిల్లా మచిలీపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై కృష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భూసంస్కరణలపై ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించి ఎన్నికల బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చారు.

ముమ్మిడివరం తహసీల్దార్‌గా శ్రీను నాయక్




ముమ్మిడివరం: ముమ్మిడివరం తహసీల్దార్‌గా బి.శ్రీను నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లాలో ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్‌లో స్పెషల్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సీహెచ్ విజయశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

దృష్టి మళ్లిస్తారు.. సొత్తు దోచేస్తారు

- బ్యాంకులు, ఏటీఎంల వద్ద పాగా వేస్తున్న దొంగలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న డీఎస్పీ అంబికా ప్రసాద్


అమలాపురం టౌన్: రోడ్డుపై కరెన్సీ నోట్లు పాడేస్తారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అవి మీవే చూసుకోండి అంటారు. వాటిని తీసుకుందామన్న ప్రయత్నంలో ఉండగా చేతిలో ఉన్న డబ్బుల బ్యాగ్ లాక్కుని పరారవుతారు... వృద్ధులకు, నిరక్షరాస్యులకు బ్యాంకులో విత్‌డ్రా ఫాం రాయడానికి సాయం చేస్తున్నట్లు నటిస్తారు. వారు ఆ డబ్బులు డ్రా చేసుకుని వెళుతుండగా ఫాలో అవుతూ ఎక్కడైనా ఆగినప్పుడు తెలివిగా దృష్టి మళ్లించి నగదు కాజేస్తారు. నేరస్తుల బృందంలో కొందరు దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తే మరికొందరు డబ్బులు ఒడుపుగా తస్కరించి పరారవుతారు. ఈ తరహా మోసాలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయని అమలాపురం డీఎస్పీ అంబికా ప్రసాద్ చెబుతున్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తులతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ముఖ్యంగా బ్యాంకుల వద్ద ఈ తరహా మోసాలు జరిగేందుకు అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా గత రెండు నెలలుగా ఈ తరహాలో దృష్టి మళ్లించి మోసం చేసే బ్యాచ్‌లు అమలాపురం పట్టణం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం మండలాల పరిధిలో సంచరిస్తున్నట్లుగా తమ దృష్టికి రావడంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని చెబుతున్నారు.



ఇవిగో ఉదాహరణలు

- గతేడాది అమలాపురంలోని ఒక బ్యాంక్ వద్ద ఓ సీనియర్ సిటిజన్ రూ.లక్ష డ్రా చేసుకుని తన మోటారు సైకిల్ డిక్కీలో పెట్టుకున్నారు. దాహం వేసి పక్కనే ఓ జ్యూస్ షాపునకు వెళ్లి తిరిగి వచ్చేలోపు అప్పటికే ఆ సీనియర్ సిటిజన్‌ను అనుసరిస్తున్న అగంతకుడు డిక్కీలో ఉన్న రూ.లక్ష కాజేసి అదృశ్యమయ్యాడు.
- కొన్ని నెలల క్రితం అమలాపురంలోని ఓ బ్యాంక్ ఏటీఎం వద్ద నిరక్షరాస్యులైన ఓ మహిళ తన డెబిట్ కార్డుతో డబ్బులు డ్రా చేయడానికి ఇబ్బంది పడుతుంటే అక్కడే ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి తాను సాయం చేస్తానంటూ ముందుకొచ్చి కార్డు తీసుకున్నాడు. ఏటీఎం పిన్ తెలుసుకుని తన దగ్గర ఉన్న పనిచేయని కార్డు ఏటీఎంలో పెట్టి డబ్బులు రావడం లేదని ఆమెను నమ్మించి పంపేశాడు. అనంతరం ఆమె అసలు ఏటీఎం కార్డుతో డబ్బులు డ్రా చేసేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.
- రావులపాలెంలో ఈ నెల 3వ తేదీన ఉదయం ఓ బ్యాంక్‌లోకి ఓ వ్యక్తి వెళ్లి రూ.లక్ష నగదు డ్రా చేసుకున్నాడు. ఆ డబ్బుతో బ్యాంకు బయటకు వచ్చి చూసే సరికి తన మోటారు సైకిల్ ముందు చక్రం టైర్ పంక్చరు అయ్యి ఉంది. డబ్బును మోటారు సైకిల్ సైడ్ బాక్సులో పెట్టుకుని బండిని నడిపించుకుంటూ వెళుతున్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతడిని మాటల్లో దింపి దృష్టిని మళ్లించి నగదు కాజేసి పరారై పోయారు.

గుర్తు తెలియని వ్యక్తుల ఉచ్చులో పడవద్దు



బ్యాంకుల వద్ద, ఏటీఎం వద్ద కొందరు మోసగాళ్లు సంచరిస్తున్నారు. అందుకే అపరిచిత వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థల వద్ద సంబంధిత మేనేజర్, సిబ్బంది సహాయం మాత్రమే తీసుకోవాలి. గుర్తు తెలియని వ్యక్తుల ఉచ్చులో పడవద్దు. మోసాలకు పాల్పడే వ్యక్తులు తారసపడినప్పుడు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు లేదా 100 లేదా 112 నెంబరుకు డయల్ చేసి సమాచారం అందించాలి.

– డీఎస్పీ అంబికా ప్రసాద్